క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



తరలివచ్చిన భక్తులు

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామంలో శనివారం సుంకులా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం అర్చకులు హోమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

తుగ్గలి: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పగిడిరాయి జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎంపికైనట్లు శనివారం ఫిజికల్ డైరెక్టర్ వేణు తెలిపారు. కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఎంపికలో ఫుట్‌బాల్ పోటీల్లో రామ్‌చరణ్, అథ్లెటిక్స్‌లో ఈశ్వర్‌కార్తీక్, ఖోఖోలో రవీంద్రనాయుడు, షూటింగ్‌బాల్‌లో అనిల్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు వైజాగ్, పల్నాడు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులు ఎంపికపై హెచ్‌ఎం గిడ్డమ్మ, ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్ అభినందించారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వెంకటాపురం కాలనీలో రెండు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో గుడిసె కాలిపోయి నష్టపోయిన చిన్న ఈరన్న కుటుంబానికి శనివారం స్థానిక భక్త మార్కండేయ స్వామి సేవాసమితి సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. నెలకు సరిపడా నిత్యావసర సరుకులను సేవాసమితి సభ్యులు తాటికొండ హరిబాబు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి నిర్వాహకులు శ్రీనివాసులు, సూర్యనారాయణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న సర్పంచ్

ఆలూరు: మండల పరిధిలోని ఎం.కొట్టాల గ్రామానికి చెందిన రామాంజనేయులు(45) గత నెల దేవరట్టు బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు వెళ్లి గుండెపోటుతో మృతిచెందాడు. అతడు వైఎస్సార్ బీమాలో సభ్యుడు కావడంతో ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు మంజూరైంది. శనివారం మట్టి ఖర్చుల కింద రూ.10 వేలను మృతుడి భార్య ఎలీశమ్మకు సర్పంచ్ రాజశేఖర్ అందజేశారు. మిగిలిన మొత్తాన్ని త్వరలో ప్రభుత్వం బ్యాంకు ఖాతాలో జమచేయనుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీసీ కెనాల్ సాగు నీటి విడుదల కోసం నిరసన



నిరసన తెలుపుతున్న ఆయకట్టు రైతులు

చిప్పగిరి: హంద్రీ నీవా కాలువ ద్వారా ఏబీసీ కెనాల్‌కు వదిలే నీటి తూము అధికారులు పూర్తిగా మూసి వేయడంతో రైతులు రెండు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో వైఎస్సార్ సీపీ నాయకుడు జూటూరు మారయ్య ఆధ్వర్యంలో పలువురు రైతులు నిరసన చేపట్టారు. ముందస్తు సమాచారం లేకుండా నీటిని బంద్ చేయడం తగదని రైతులు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి పంటలు ఎండిపోక ముందే నీటిని విడుదల చేసి తమను ఆదుకోవాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారం

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామంలో నెలకొన్న తాగు నీటి సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలో ఉన్న మూడు బోర్లలో రెండు బోర్లు ఎండిపోయాయి. మిగతా ఒక్క బోరు నుంచి వస్తున్న నీరు గ్రామస్తులకు చాలడం లేదు. సమస్యలను తెలుసుకున్న మంత్రి గుమ్మనూరు జయరాం ఇటీవల బోరు వేయించారు. రెండు ఇంచుల నీరు పడటంతో రూ.5 లక్షలు మంజూరు చేయించి బోరు పాయింట్ నుంచి గ్రామంలోని మినీ ట్యాంకుల వరకు పైపులైన్ వేయించారు. తాగు నీటి సమస్య పరిష్కారం కావడంతో మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి మెండుగా..

- గణనీయంగా తగ్గిన వలసలు
- మూడేళ్లలో ఉపాధి కూలీలకు రూ.54.09 కోట్ల వేతనాలు చెల్లింపు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

తుగ్గలి: వలసలను నివారించేందుకు ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు వరంగా మారింది. రోజు వారీ వేతనం కూడా గిట్టుబాటవుతోంది. సొంతూళ్లలోనే మెరుగైన 'ఉపాధి' లభిస్తుండడంతో వలసలు తగ్గ ముఖం పట్టాయి. గతంలో పనులు లేక వేలాది మంది కూలీలు వివిధ ప్రాంతాలకు వలస వెళ్లేవారు. గుంటూరు, రాజంపేట, రైల్వే కోడూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు పిల్లా పాపలతో వలసవెళ్లి అక్కడ నానా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అక్కడే రెండు, మూడు నెలలు పనిచేసుకుని స్వగ్రామాలకు తిరిగి వచ్చేవారు. కరోనా కాలం నుంచి ప్రభుత్వం పెద్ద ఎత్తున పనులు కల్పిస్తుండడంతో వలసలు బాగా తగ్గిపోయాయి. ఉపాధి హామీ పథకం ద్వారా మూడేళ్లలో 78,318 మంది కూలీలకు రూ.54.09 కోట్లు ప్రభుత్వం వేతనాలు చెల్లించింది.

సొంతూళ్లలోనే సాఫీగా..

మండలంలో 14,976 జాబ్‌కార్డులు ఉండగా 23,969 మంది కూలీలకు పనులు కల్పించారు. పనికి వెళ్లే ప్రతి కూలీకి ప్రభుత్వం కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు చేపట్టింది. కొలతల ప్రకారం కూలీ పని చేస్తే రూ.272 వేతనం వస్తుంది. దీనివల్ల వేతనం గిట్టుబాటవుతోందని ఉపాధి కూలీలు చెబుతున్నారు. వేతనాలు కూడా సకాలంలో అందుతుండడంతో ఉత్సాహంగా పనికి వెళ్తున్నారు. పని కల్పనలో తుగ్గలి మండలం మెరుగ్గా నిలిచింది.

ఒక్కో జాబ్‌కార్డుదారుడికి రూ.25 వేలకు పైగా లబ్ధి..

జాబ్‌కార్డు ఉండి ఉపాధి పథకంలో పనికి వెళ్లే వారికి రూ.25 వేలకు పైగా వేతనం రూపంలో అందుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 6.66 ల క్షల మందికి పని కల్పించాలని లక్ష్యంగా పెట్టుకు న్నారు. తీవ్ర వర్షాభావం దృష్ట్యా ఉపాధి టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇప్పటికే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఉపాధి పనులు గుర్తించారు. అడిగిన వారందరికీ ప నులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉపాధి అధికారులు చెబుతున్నారు.

మూడేళ్లలో కూలీలకు చెల్లించిన వేతనాలు..

సంవత్సరం	జాబ్‌కార్డులు	పనికెళ్లిన కూలీలు,	చెల్లించిన వేతనాలు
2020-21,	12,794,	24,418,	రూ.16.57 కోట్లు
2021-22,	14,016,	25,931,	రూ.18.25 కోట్లు
2022-23,	14,976,	27,969,	రూ.19.27 కోట్లు

అడిగిన వారందరికీ పనులు

జాబ్‌కార్డు కలిగి ఉండి దరఖాస్తున్న కూలీలందరికీ ఉపాధి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్ల ద్వారా డిమాండ్ పెట్టాం. సోమవారం నుంచి అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని సిబ్బందికి సూచించాం. కూలీలు ఎవరూ వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి.

– రామకృష్ణ, ఏపీఓ, తుగ్గలి

ఉపాధి పనులు ఆదుకున్నాయి



మూడేళ్లుగా ఉపాధి పనులు బాగా ఆదుకుంటున్నాయి. అంతకు ముందు ఊళ్లో పనుల్లేక హైదరాబాద్‌కు వలస వెళ్లేవాళ్లం. అక్కడ పనులు చేసుకుని రెండు, మూడు నెలల తర్వాత సొంతూరికి వచ్చేవాళ్లం. అక్కడ చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు ఉన్న ఊళ్లోనే ఉపాధి పనులకెళ్తున్నాం. ఉపాధితో లబ్ధి పొందుతున్నాం.

– వీరాంజనేయులు, జీజీరాళ్ల

గిట్టుబాటు కూలీ అందుతోంది



మా ఇంట్లో మేం ముగ్గురం పనికెళ్తాం. రోజూ కూలీ రూ.270 వరకు తీసుకుంటున్నాం. ఏటా సరాసరి రూ.26 వేల దాకా ఉపాధి పథకం ద్వారా కూలీ డబ్బు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడే కూలీ డబ్బు అందుతుండడంతో వలస పోవడం మానేశాం. ఉపాధి పనులతో కుటుంబం సాఫీగా సాగుతోంది.

– రంగన్న, ఉప్పర్లపల్లి

గ్రామాభివృద్ధికి సహకరించండి

మద్దికెర: ఇంటి, కుళాయి పన్నులు, పంచాయతీ బాడుగలు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ సుహాసిని, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి కోరారు. శనివారం వారు మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రజలు సహకారం ఎంతో అవసరమన్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు వచ్చినపుడు పన్నులు చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీలక్ష్మి

మద్దికెర: ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి విద్యార్థినులకు సూచించారు. శనివారం ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహంలో విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించారు. తోటి విద్యార్థులు ఆరోగ్యం సరిగా లేకపోతే వెంటనే సంక్షేమ అధికారికి తెలియజేయాలన్నారు. చేతులు శుభ్రం చేసుకున్న తర్వాతే భోజనం చేయాలన్నారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి ఉష, ఏఎన్‌ఎం అంజలి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల నిర్ణయంపై హర్షం

చిప్పగిరి: అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల ఎంపీపీ జూటూరు హేమలత హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీపీ కార్యలయంలో ఆమె మాట్లాడుతూ ప్రజాసమస్యలను ప్రభుత్వానికి తెలిపే క్రమంలో జర్నలిస్టులు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటుంటారని, అలాంటి వారిని గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. జగన్న మంత్రి వర్గం ఇళ్ల స్థలాల అంశంపై ఆమోదం తెలపడం సంతోషకరమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మారయ్య, లింగన్న, లాల్‌స్వామి పాల్గొన్నారు.

హొళగుంద: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల ఏపీయూడబ్ల్యూజే మండల నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏపీ కేబినెట్ మీటింగ్‌లో జర్నలిస్టులకు మూడు సెంట్ల చొప్పున స్థలాన్ని ఇచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని మంత్రి మండలి ఆమోదించడం సంతోషకరమని ఏపీయూడబ్ల్యూజే నాయకులు అమీర్ సాబ్, సీహెచ్ నాగరాజు అన్నారు. తమ మండల కమిటీ తరఫున ఏపీ ప్రభుత్వానికి, సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

ముంగిటకే ప్రభుత్వ సేవలు

- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



సచివాలయం, ఆర్బీకేలను ప్రారంభించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలందించాలని సిబ్బందికి సూచించారు. వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనాలను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ రామళ్లకోట గ్రామంలో రూ.2.90 కోట్లతో మురుగు కాలువలు, రూ.59 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. రూ.1.50 కోట్లతో నీటి ట్యాంకు నిర్మాణం, పైప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. రూ.2.34 కోట్లతో నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో, ప్రభుత్వ భవనాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామం నుంచి అన్ని వైపులా ప్రధాన రహదారులను తీర్చిదిద్దామన్నారు. అందులో భాగంగా వెల్దుర్తి వైపు రూ.10 కోట్లతో డబుల్ రోడ్డు పూర్తి చేశామన్నారు. కాల్వబుగ్గ వైపు రహదారి ఆధునీకరించామన్నారు. రూ.40 కోట్లతో బేతంచెర్ల వైపు డబుల్‌రోడ్డు పనులు కొనసాగుతున్నాయన్నారు. ప్రాథమిక ప్రభుత్వాసుపత్రి మంజూరైందని, ఇప్పటికే ఇద్దరు వైద్యుల నియామకం జరిగిందని, త్వరలో భవన నిర్మాణం జరుగుతుందన్నారు. ఇంత అభివృద్ధి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, పీఆర్ డిప్యూటీ ఈఈ శేషయ్య, ఏడీఏ మోహన్ విజయ్ కుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ నిర్మల, మాధవస్వామి, రాధాకృష్ణారెడ్డి, కోఆప్షన్ మెంబర్ మాలిక్‌బాషా, కృష్ణారెడ్డి, బత్తుల రాముడు, బీటీ నాయుడు, వెంకటేశ్వర్లు, ఇమ్మానియల్, గోరంట్ల, నమశ్శివాయ, రామయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మెరుగైన వైద్యం



కృష్ణగిరి రిజర్వాయర్ పంపింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న బొమ్మన రవిరెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న మాదిగ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వెల్దుర్తితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో వేలాది కుటుంబాలకు అందుబాటులో, హైవే అనుకుని ఉన్న పట్టణంలోని సామాజిక ప్రభుత్వాసుపత్రిలో ఒకే డాక్టరు, కొందరు సిబ్బంది, పాత భవనంలో కొనసాగేదన్నారు. అయితే ఆనాడు నేతలు ఎవరూ పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సహకారంతో దాదాపు అరున్నర కోట్ల రూపాయలతో నూతన భవనం నిర్మించారన్నారు. అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించి ఏకంగా 9మంది స్పెషలిస్టు డాక్టర్లు, 30కు మించి నర్సులు, సిబ్బంది నియామకంతో మెరుగైన సేవలందుతున్నాయన్నారు. అలాగే గత ప్రభుత్వం నీటి సమస్య తీవ్రంగా ఉండగా, తమ ప్రభుత్వ నాటి నుంచి వెల్దుర్తి పట్టణంలో ప్రతిరోజు వేలాది మంది ప్రజలకు మంచి నీటి సరఫరా జరుగుతోందన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, దేవారాజ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత



రంగమ్మతో బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ ప్రతాప్

తుగ్గలి: మండల పరిధిలోని రాతనకు చెందిన వృద్ధురాలు కలగంటి రంగమ్మ వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ బెంగళూరులో ఉన్న కొడుకు వద్దకు వెళ్లింది. వలంటీర్ ప్రతాప్ శనివారం అక్కడికి వెళ్లి ఆమెకు పింఛన్ సొమ్ము అందజేశారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ



హనుమంతుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివయ్య

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని కడిమెట్ల గ్రామానికి చెందిన గొల్ల హనుమంతు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. శనివారం వలంటీర్ శివయ్య అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారు.

గిరిగెట్ల మాజీ సర్పంచ్ రామిరెడ్డి మృతి



రామిరెడ్డి (ఫైల్)

తుగ్గలి: సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు గిరిగెట్ల మాజీ సర్పంచ్ తంగరడోణ రామిరెడ్డి(80)అనారోగ్యంతో మృతి చెందారు. రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

తుగ్గలి: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. బొందిమడుగులకు చెందిన దస్తగిరి(60) అనారోగ్యం, కాలికి గాయమై బాధపడుతున్నాడు. శుక్రవారం లింగనేనిదొడ్డి రైల్వే స్టేషన్‌లో రైలు దిగి పట్టాలు దాటుతుండగా మరో వైపు నుంచి వచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డోన్ రైల్వే పోలీసులు శనివారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు

గోనెగండ్ల: మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ రైతులకు సూచించారు. శనివారం ఏఓ హేమలతతో ఆయన అలువాల గ్రామ పరిధిలో సాగైన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మొక్క జొన్న పంటను కత్తెర పురుగు ఆశించిందన్నారు. స్పాయినటోరం 1మిల్లీ లీటర్ లేదా క్లోరాంత్రినప్రోల్ 0.3 మిల్లీ లీటర్ లేదా ఏమమేక్టిన్ బెంజోయేట్ 0.3 గ్రాములు.. లీటర్ నీటితో కలిపి సుడులుల్లో పడేలా పిచికారీ చేసుకోవాలన్నారు. రెండు కిలోల ఇసుకలో 60 మిల్లీ లీటర్లు క్లోరంత్రినిప్రోల్ మందును కలుపుకొని మొక్కల సుడులుల్లో వేయాలన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

నందవరం: మండల కేంద్రంలోని సచివాలయం–1 ఆవరణలో వెంకటేశ్వర కంటి వైద్య శాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగవంశీకృష్ణ నేతృత్వంలో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, గ్రామ ఉప సర్పంచ్ శివారెడ్డిగౌడ్, నాయకులు రమేశప్పగౌడ్, భీమన్నగౌడ్, సచివాలయ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

నందవరం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి తెలిపారు. శనివారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో జరుగుతున్న మట్టి రోడ్డు పనులు, పారిశుధ్య పనులను ఈఓపీఆర్డీ ఈశ్వరయ్యతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉరుకుందు, వీరారెడ్డి, తారకరాముడు, చెన్నరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తం

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి గ్రామంలో నీటి సమస్య పరిస్కారానికి శనివారం సర్పంచ్ హరిజన యంకప్ప చర్యలు చేపట్టారు. బోరు మోటారు చెడిపోవడంతో కొంతకాలంగా నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం మోటారుకు సర్పంచ్ మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

హొళగుంద: స్థానిక ఈబీసీ, బీసీ కాలనీలలో శనివారం సీసీ రోడ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నారు. అందులో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదాం



సభలో మాట్లాడుతున్న ఎస్డీపీఐ రాష్ట్ర నాయకుడు

హొళగుంద: కేంద్రప్రభుత్వం సాగిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ ఎండగట్టాలని ఎస్డీపీఐ రాష్ట్ర నాయకులు హఫీజ్ అతావుల్లా ఖాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్నటుంతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. రాబోయే కాలంలో ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న పార్టీలకు గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో ఎస్డీపీఐ ఆలూరు నియోజకవర్గ అధ్యక్షుడు సైపుల్లా నాయకులు రహిమాన్, హారూన్, షఫి, బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు పుల్లగుమ్మి సచివాలయం ప్రారంభం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం భవనాన్ని ఆదివారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించనున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి పనులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ బంగారమ్మ

ఎమ్మిగనూరు రూరల్: ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీ బంగారమ్మ సిబ్బందికి సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్, ఈసీలు గ్రామాలకు వెళ్లి పనులు కల్పిస్తామని, వలసలు వెళ్లొద్దని ప్రజలకు చెప్పాలన్నారు. ఉన్న ఊరిని వదలి పిల్లలతో వలస వెళ్లటంతో ఇబ్బంది పడతారని వివరించాలన్నారు. సోమవారం నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ పనులకు కూలీల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీఓ విజయమోహన్, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని హైవే-44పై మదార్‌పురం వద్ద శనివారం లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 110 బ్యాగులలోని దాదాపు 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని, లారీ డ్రైవర్ మొహమ్మద్‌ను, బియ్యం అక్రమ రవాణా చేస్తున్న శోభన్‌బాబును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితులు బియ్యం ఎక్కడి నుంచి ఎలా సేకరించారన్నది, ఎక్కడికి రవాణా చేస్తున్నారనే దానిపై పూర్తిస్థాయిలోదర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

నందవరం: స్థానిక జెడ్పీహెచ్ పాఠశాల మైదానంలో శనివారం జిల్లా స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అండర్-17 బాయ్స్ అండ్ గర్ల్స్ ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. చిత్తూర్-నెల్లూరు జట్లు మధ్య మ్యాచ్ సరవత్తరంగా సాగింది. 1-1 గోల్స్‌తో డ్రాగా ముగిసింది. మరో మ్యాచ్ కర్నూలు - ఈస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగింది. కర్నూలు జట్టు 10-0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో కృష్ణా - విజయనగరం జట్లు తలపడ్డాయి. కృష్ణా జిల్లా జట్టు 6 గోల్స్ చేసి విజయం పొందింది. నాల్గవ జట్టు గుంటూరు - శ్రీకాకుళం మధ్య జరిగింది. గుంటూరు జట్టు 4-0 గోల్స్ తేడాతో గెలుపొందింది.హెచ్‌ఎం శివరామ్, టోర్నమెంట్ పర్యవేక్షకులు ప్రభాకర్, లతీఫ్, ఉమాపతి, కవిరాజు, కిషోర్ పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోండి



ఆలూరులో ప్రత్యేక ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఏఈఆర్వో రామాంజనేయులు



ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరి

కృష్ణగిరి: ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న ఓటర్ నమోదు స్పెషల్ డ్రైవ్‌లను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ నమోదును శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 40 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉన్నారని, అర్హులైన వారు కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఓటర్ జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. మండల వ్యాప్తంగా కొత్తగా ఓటర్ నమోదు 98, ఫారం–7 కింద 150, ఫారం–8 కింద 50 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఆదివారం కూడా స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్నారు.

వెల్దుర్తి మండలంలో..

మండల కేంద్రంతోపాటు రామళ్లకోట, పలు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని వెల్దుర్తి తహసీల్దార్ శివరాముడు పరిశీలించి పలువురు అభ్యర్థుల దరఖాస్తులను స్వయంగా స్వీకరించారు. ఆయన వెంట ఆర్ఐ మస్తాన్ ఉన్నారు.

- **మద్దికెర:** ఓటరు నమోదుకు ప్రతి శని, ఆదివారాలలో ఆయా గ్రామాల్లో పోలింగ్ బూత్‌లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు సూచించారు. ఇప్పటివరకు 1300 ఓట్లు తొలగించడం జరిగిందన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారు, చనిపోయిన, పెళ్లి చేసుకొని ఇతర గ్రామాలకు వెళ్లిపోయినవారి పేర్లు తొలగించామన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

ఆలూరు రూరల్: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలూరు అసెంబ్లీ ఎలక్షన్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రామాంజనేయులు సూచించారు. శనివారం ఆయన ఆలూరులోని 128, 128 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదును తనిఖీ చేశారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గుండాల్ నాయక్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బసన్నగౌడ్ ఉన్నారు.

- **ఆస్పరి:** మండల కేంద్రంతో పాటు చిరుమాన్‌దొడ్డి, బిల్లేకల్లు, శంకరబండ గ్రామాల్లో నిర్వహిస్తున్న పోలింగ్ బూత్‌లను శనివారం తహసీల్దార్ కుమారస్వామి పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.
- **హొళగుంద:** మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు హుసేన్‌సాహెబ్ తనిఖీ చేశారు. కేంద్రంలో ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించారు. ఓటరు నమోదును పక్కాగా చేపట్టాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ దినోజ్, సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్‌ఓలు ఉన్నారు.
- **దేవనకొండ:** పోలింగ్ స్టేషన్‌లో ఉండి ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించాలని తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ బీఎల్‌ఓలు బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం ఆయన మండలంలోని ఈదులదేవరబండ, దేవనకొండ జెడ్పీ పాఠశాలల్లోని పోలింగ్ స్టేషన్‌లను తనిఖీ చేశారు.
- **హాలహర్వి:** ఓటు హక్కు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ మల్లికార్జున బీఎల్‌ఓలను ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశమై పలు సూచనలు చేశారు.
- **గోనెగండ్ల:** మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. గోనెగండ్ల, హెచ్.కైరవాడి, వేముగోడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ వేణుగోపాల్ పరిశీలించారు.